WANTED REPORTERS
నవతరం
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ కావాలన్న
కోరిక ఉందా...
ఐతే నవతరం మీ కోసం
అద్భుతమైన అవకాశం కల్పిస్తుంది.
వివరాలకు : 9618907705
navataramteugudaily@gmail.com

# నవతరం

హైదరాబాద్ సంపుటి : 9 సంచిక : 222 సోమవారం, ఆగస్టు 10, 2026, పేజీలు - 4 వెల: 5/-

## హర్ ఘర్ తిరంగా' ఉద్యమంలో

# ప్రజలందరూ పాల్గొనాలి

### ప్రధాని నరేంద్ర మోదీ



**ఢిల్లీ, ఆగస్టు 9:** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని, దేశవ్యాప్తంగా నిర్వహించనున్న 'హర్ ఘర్ తిరంగా' ఉద్యమంలో ప్రజలందరూ ఉత్సాహంగా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఈ ఏడాది 'హర్ ఘర్ తిరంగా' ప్రచారానికి ఒక ప్రత్యేకత ఉందని ప్రధాని మోదీ అన్నారు. మన జాతీయ గేయం 'వందే మాతరం' 150 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సంద ర్భంగా ఈ ఏడాది వేడుకలను అంక తం చేస్తు న్నట్లు తెలిపారు.మన మువ్వన్నెల జెండా మన గర్వకా రణం.. వికసిత భారత్ నిర్మాణానికి మనమంతా కలిసికట్టుగా పునరంకితం కావడానికి ఈ ఉద్యమంలో పాల్గొందామని ప్రధాని సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా జిల్లాలు, బ్లాకులు, పంచాయతీ స్థాయిల్లో తిరంగా ర్యాలీలు, బైక్/సైకిల్ ర్యాలీలు, మువ్వన్నెల వెలుగులతో ప్రముఖ భవనాల అలంకరణలు, కాన్సర్ట్‌లు, రంగోలీ పోటీలు నిర్వహించనున్నారు. సూర్యపథ్ తిరంగా: ఈ ఏడాది ప్రత్యేక ఆకర్షణగా విశ్వవ్యాప్తంగా ఉన్న భారతీయులను ఏకం చేస్తూ తొలిసారిగా 'సూర్యపథ్ తిరంగా' వేడుకలను నిర్వహించను న్నారు.కలిసి పాడుదాం 'వందే మాతరం': చేపట్టనున్నారు.

## నాగార్జునసాగర్‌లో వరుణ యాగం..

### హాజరుకానున్న సీఎం రేవంత్



**హైదరాబాద్, ఆగస్టు 9 :** నాగార్జునసాగర్‌లో నిర్వహించే వరుణ యాగంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. సాగర్ విజయ్ విహార్ టూరిజం గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో ఈ యాగం నిర్వహించనున్నారు. రేపు (సోమవారం) మధ్యాహ్నం 3 గంటలకు పూర్ణాహుతి కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరుకానున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో సీఎం బయలుదేరనున్నారు.రేపు 2.45 గంటలకు నాగార్జునసాగర్ హిల్ కాలనీలోని బీసీ రెసిడెన్షియల్ స్కూల్‌కు సీఎం చేరుకోనున్నారు. అక్కడి నుంచి విజయ్ విహార్ టూరిజం గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో జరిగే యాగం వద్దకు రేవంత్‌రెడ్డి చేరుకోనున్నారు. యాగం ముగిసిన అనంతరం 4 గంటలకు హైదరాబాద్‌కు ముఖ్యమంత్రి బయలుదేరనున్నారు. 108 మంది రుత్వికులతో, 11 హోమగుండాలతో విజయ్ విహార్‌లో వరుణ యాగం నిర్వహించనున్నారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చెందిన అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో వరుణయాగం జరిపిస్తారు. కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో సమృద్ధిగా వర్షాలు కురవాలని సంకల్పించనున్నారు.

## చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయాన్ని

# గోల్డెన్ టెంపుల్‌గా మారుస్తాం

### : బండి సంజయ్..



**హైదరాబాద్:** తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా మారుస్తామని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ప్రతి ఏటా బోనాల ఉత్సవాలకు ఎవరూ ఊహిం చలేనంత నిధులను ఖర్చు చేసి అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. లాల్ దర్వాజ సింహవాహిని బోనాల ఉత్సవాల్లో బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం, బీఆర్ఎస్ నేతలపై ఆయన నిప్పులు చెరిగారు.కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. 'జీహెచ్ఎంసీ ఎన్నికల వేళ చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని నేను దర్శించుకుంటే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హేళన చేశారు. నేడు కేటీఆర్‌కు జ్ఞానోదయమైంది. అందుకే భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించు కునేందుకు వచ్చారు. బీఆర్ఎస్ పాలనలో లాల్ దర్వాజ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయ అభివృద్ధికి రూ.20 కోట్లు ఇస్తానని కేసీఆర్ మోసం చేశారు.

## కుమురం భీమ్ ఆశయాల సాధనకు అందరూ

# ఐక్యంగా కృషి చేయాలి

### : మంత్రి సీతక్క

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 9:** కుమురం భీమ్ ఆశయాల సాధనకు అందరూ ఐక్యంగా కృషి చేయాలని తెలంగాణ మంత్రి సీతక్క సూచించారు. ఈరోజు(ఆదివారం) అశ్వారావుపేటలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో మంత్రి సీతక్క, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, పాల్గొన్నారు. స్థానిక కూడలిలో కుమురం భీమ్ విగ్రహావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడారు. మన జాతి ఔన్నత్యాన్ని, జాతి కీర్తిని మన హక్కులను కాపాడినటువంటి మహనీయుడి విగ్రహావిష్కరణ చేయడం సంతోషకరమని



తెలిపారు.మన చరిత్ర పోరాటాల చరిత్ర అని మంత్రి సీతక్క అభివర్ణించారు. అడవిలో మన పూర్వీకులు జీవనం మొద లుపెట్టిన నాటినుంచి చెట్టుతో, పుట్టతో, వానలతో, వరదలతో, జంతువులతో పోరాడుతూ ఇక్కడి దాకా వచ్చామని వివరించారు. మరి పోరాటాల చరిత్రలో కాకతీయులకు వ్యతిరేకంగా పోరాడిన సమ్మక్క- సారలమ్మ నుంచి బ్రిటిష్ కాలంలో పోరాడినటు వంటి కుమురం భీమ్ వరకు ఎంతో స్ఫూర్తి పొందామని చెప్పుకొచ్చారు. రాజ్యాంగంలో చూస్తే మనకు ప్రత్యేక స్వయం ప్రతిపత్తి, ప్రత్యేక భూ హక్కులు, ప్రత్యేక ఉద్యోగ, ఉపాధి హక్కులు ఉన్నాయని ప్రస్తావించారు. ఆనాడు అంబేద్కర్, నెహ్రూ ఇద్దరు కలిసి మన జాతికి స్వయం ప్రతిపత్తి ఉండాలని 5వ షెడ్యూల్ ఏరియా ఏర్పాటు చేశారని వివరించారు.మన ప్రాంతాలకు 6వ షెడ్యూల్ ప్రకారం.. ఈశాన్య రాష్ట్రాలకు మణిపూర్, అస్సాం, సిక్కిం అలాంటి రాష్ట్రంలో ప్రత్యేక ప్రతిపత్తిని సీతక్క తెలిపారు.

## వెదురు 'దందా'పై

# అనుమానాల మబ్బులు..

- అటవీ శాఖ నిశ్శబ్దం వెనుక మర్మమేంటి?
- పగటిపూట నరికివేత.. రాత్రివేళల్లో రహస్య రవాణా?
- ట్రాక్టర్‌కు రూ. 2 వేల మామూళ్లు.. ఒక్కో లోడ్‌కు రూ. 15 వేల దందా?
- సత్తుపల్లి నుంచి వచ్చాయంటున్న వ్యకి.. వెదురు 'రవాణా అనుమతి పత్రాలు' ఏవి?
- కార్పొరేషన్ అధికారులు అమ్ముకుంటున్న ఆరోపణ నిజమేనా?



**ఖమ్మం -- భద్రాద్రి కొత్తగూడెం:** ప్రభుత్వ అటవీ సంపదకు రక్షణగా నిలవాల్సిన వ్యవస్థలోనే వెదురు బొంగుల రవాణా వ్యవహారం తీవ్ర అనుమానాలకు తావిస్తోంది. అశ్వారావుపేట మండలం, వేదాంతపురం అటవీ అభివృద్ధి సంస్థ పరిధిలో పాత తోటలను తొలగించిన అనంతరం మిగిలిన వెదురు బొంగుల నిర్వహణపై స్థానికంగా అనేక ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ ఆస్తిని కాపాడాల్సిన బాధ్యతను పక్కనబెట్టి, అక్రమ ఆర్జనకు మార్గం సుగమం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### ■ పగలు నరికివేత.. రాత్రికి సరిహద్దు దాటేలా?

వేదాంతపురం పరిధిలోని ప్రభుత్వ అటవీ భూముల్లో పగటిపూట గుట్టుచప్పుడు కాకుండా వెదురు బొంగులను నరికి వేస్తున్నట్లు సమాచారం. ఆ తర్వాత చీకటి పడగానే లారీలు, ట్రాక్టర్లలో యథేచ్ఛగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. బీర, దొండ పాదులు వేసుకునే సాగుదారుల అవసరాలను ఆసరాగా చేసుకుని ఒక్కో వాహనం వెదురును సుమారు రూ. 15 వేల వరకు విక్రయిస్తున్నారనే ప్రచారం సాగుతోంది. ఈ అక్రమ రవాణాను కప్పిపుచ్చేందుకు, వాహనాలు సజావుగా వెళ్లేందుకు ఒక్కో ట్రాక్టర్‌కు రూ. 2 వేల చొప్పున మామూళ్లు చేతులు మారుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### ■ 'సత్తుపల్లి' వాదనలోని డ్రామా..

మరోవైపు, అశ్వారావుపేట పొలాల్లో ప్రత్యక్షమైన వెదురు బొంగుల నిల్వలపై విచారిస్తే.. ఆ వెదురు సత్తుపల్లి ప్రాంతం నుంచి లారీ ద్వారా వచ్చిందని వేదాంతపురం కార్పొరేషన్ అడవి నుండి తీసుకెళ్లినట్లు అనుమానిస్తున్న వ్యక్తి చెబుతున్నాడు. అయితే అటవీ




ఉత్పత్తుల రవాణా నిబంధనల ప్రకారం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెదురును తరలించాలంటే అటవీ శాఖ జారీ చేసే అధికారిక 'రవాణా అనుమతి పత్రం' (పాస్) తప్పనిసరిగా ఉండాలి. సత్తుపల్లి డిపో నుంచి వచ్చాయంటున్న ఆ వెదురుకు సంబంధించిన కొనుగోలు రసీదులు, రవాణా పత్రాలు, వాహనం వివరాలు ఇప్పటివరకు బయటకు రాకపోవడం అనుమానాలను బలపరుస్తోంది.

### ■ రికార్డులు బయటపెడితేనే నిజా నిజాలు వెలుగులోకి..

వ్యక్తులను లేదా రైతులను లక్ష్యంగా చేసుకోవడం కంటే, అటవీ శాఖ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరిపితే అసలు నిజాలు బయటపడతాయి. వేదాంతపురం తోటల తొలగింపు తర్వాత మిగిలిన వెదురు నిల్వల 'సరుకు నమోదు పుస్తకాన్ని' (స్టాక్ రిజిస్టర్) పరిశీలించాల్సి ఉంది. ఒకవేళ ప్రభుత్వ వెదురును విక్రయించి ఉంటే, ఆ సొమ్ము ప్రభుత్వ ఖజానాకు జమ అయిన చెల్లింపు రశీదులను అధికారులు బహిర్గతం చేయాలి. అనుమతి పత్రాలు లేకుండా రాత్రివేళల్లో వెదురు తరలిపోతుంటే స్థానిక సిబ్బంది పర్యవేక్షణ ఏమైనట్లు అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

అది అలా ఉండగా వేదాంతపురం కార్పొరేషన్ నుండే ఆ వెదురు బొంగులు వెళ్ళినట్లు,కార్పొరేషన్ అధికారిణి 15000రూపాయలు ఒక్కో ట్రాక్టర్ వెదురుకు తీసుకుంటుందనే ఆరోపణలు స్థానికంగా బలంగా వినిపిస్తున్నాయి.ఈ తతంగమంతా అనుమానాల వలయంలో కొట్టుమిట్టాడుతోంది.అదే నిజమైతే ఇక పై అధికారులు రంగంలోకి దిగాల్సిందే.ఏదేమైనా కార్పొరేషన్ ఫారెస్ట్ అధికారిని ఆ వెదురు ఎక్కడి నుంచి వెళ్లిందో తేల్చాల్సిన సమయం ఆసన్నమైంది.అధికారులు వెంటనే స్పందించి వేదాంతపురం నిల్వల రికార్డులు, సత్తుపల్లి రవాణా అనుమతి పత్రాలను బయటపెట్టకపోతే.. ఉన్నతాధికారుల విచారణను ఎదుర్కోవాల్సి వస్తుంది. అటవీ సంపద దుర్వినియోగంపై ఇప్పటికైనా అధికారులు మౌనం వీడి సమగ్ర విచారణ జరిపాల్సి ఉంది. కార్పొరేషన్ అధికారినీ చరవాణి ద్వారా వివరణ కోరే ప్రయత్నం చేయడంతో చాలా సందర్భాల్లో ఫోన్ స్విచ్ ఆఫ్ లో ఉంది.

## భాగ్యనగర మహిళలకు

# బోనాల పండుగ శుభాకాంక్షలు

### : కేటీఆర్



**హైదరాబాద్, ఆగస్టు 09:** అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని సింహ వాహిని అమ్మవారిని కోరుకున్నానని బీఆ ర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేట ీఆర్ తెలిపారు. దేశం కూడా బాగుండాలని అమ్మవారిని కోరుకున్నానని చెప్పారు. ఆదివారం బోనాలు సందర్భంగా లాల్ దర్వాజాలోని అమ్మవారిని మాజీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్‌తో కలిసి కేటీఆర్ దర్శించు కున్నారు.అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. సింహ వాహిని అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. భాగ్యనగర మహిళలకు ఈ సందర్బంగా ఆయన బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మీరాలం మండిలోని శ్రీ మహంకాళి అమ్మవారిని కూడా కేటీఆర్ దర్శించుకున్నారు.కేసీఆర్‌కే ఆ గౌరవం దక్కింది: తలసానిప్రపంచవ్యాప్తంగా బోనాల పండుగ ప్రసిద్ధి చెందిందని సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. 50 ఏళ్ల నుంచి బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించాలని డిమాండ్ ఉన్నా.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతే కేసీఆర్, బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించారని గుర్తు చేశారు.

## ట్రంప్ కు నెతన్యాహు మరో షాక్..!

# కథ మళ్లీ మొదటికి..!



**అమెరికా :** ఇరాన్ వార్ లో అమెరికా తమకు ఎంతగా సహకరిస్తున్నా.. తమ ప్రయోజనాల విషయ ంలో మాత్రం రాజీ పడేందుకు ఇజ్రాయెల్ ససేమిరా అంటోంది. ముఖ్యంగా గాజాలో ఘర్షణల నివారణకు ట్రంప్ ప్రతిపాది ంచిన 15 పాయింట్ల ఫార్ములాను ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇవాళ తోసిపుచ్చారు. ఈ ఫార్ములా ప్రకారం హమాస్ పూర్తిగా ఆయుధాలు విడిచే వరకూ, గాజా నుంచి తమ దళాలను ఉపసంహరించుకునే ప్రశ్నే లేదని ట్రంప్ కు తేల్చి చెప్పేశారు. ఇజ్రాయెల్ కేబినెట్ భేటీ సందర్భంగా నెతన్యాహు ఈ వ్యాఖ్యలు చేశారు.హమాస్ నిజంగా నిరాయుధులయ్యే వరకు ఇజ్రాయెల్ సైన్యం ఉపసంహరణ చేపట్టదని, తమ బలగాలకు, తమ పౌరులకు ఎదురయ్యే ముప్పులను అడ్డుకుంటూనే ఉంటుందని నెతన్యాహు క్యాబినెట్ సమావేశంలో తేల్చిచెప్పారు. గాజా యుద్ధాన్ని ముగించడానికి ట్రంప్ చేస్తున్న ప్రయత్నాల్లోని ఒక కీలక అంశాన్ని నెతన్యాహు తన వ్యాఖ్యలతో తిరస్కరించినట్లయింది. ఇజ్రాయెల్ బలగాలు వెనక్కి తగ్గే ముందు హమాస్ తన ఆయుధాలను వదులుకోవాలని ఆయన పట్టుబడుతున్నారు.

# ఆదివాసీలకు అందని రాజ్యాంగ ఫలాలు

- "అడవి ఉంటేనే ఆదివాసీ - ఆదివాసీ ఉంటేనే దేశం"
- 1/70 చట్టాన్ని పక్కన పెట్టిన అధికార యంత్రాంగం
- జిసి పునరుజ్జీవనం లేకుంటే గిరిజన రైతు బతకడు
- జుత్తు జగన్నాయకులు, సిదిరి హయాంలోనే గిరిజన అభివృద్ధి







**మందస, ఆగస్టు 9:**
అడవికి ఆదివాసీకి ఉన్న అనుబంధం వేల సంవత్సరాల నాటిది. "అరణ్యా దేవి నమస్తుభ్యం" అనే సంస్కృత శ్లోకం వేదాలలో ఉంది. అడవిలో నివసిస్తూ ప్రకృతిని పూజించడం, వనసంపదను కాపాడడం ఆదివాసీల జాతీయ విశిష్టత. రాజ్యాంగం కల్పించిన రక్షణలు, సంక్షేమ ఫలాలు ఆదివాసీలకు పూర్తిస్థాయిలో అందడం లేదు. ఈ నేపథ్యంలో ఆదివాసీల సమస్యలు, పరిష్కారాలపై మందస మండల ఎంపిపి డొక్కరి దానయ్య యాదవ్ నవతరం దినపత్రిక ప్రతినిధితో మాట్లాడారు.

ప్రశ్న 1: ఆదివాసీ దినోత్సవం రోజున మందస ఆదివాసీల పరిస్థితిని ఎలా చూస్తున్నారు? జవాబు: వేడుకలు చేసుకునే పరిస్థితి లేదు. మందస మండలం 90 శాతం గిరిజన ప్రాంతం. సవర, జాతపు తెగలు ఎక్కువ. ఇక్కడ మూడు ప్రధాన సమస్యలు ఉన్నాయి. మొదటిది భూమి. 1/70 చట్టం ఉన్నా రెవెన్యూ రికార్డుల్లో గిరిజనేతరుల పేర్లు చేరుతున్నాయి. నకిలీ ఎస్టీ ధృవీకరణ పత్రాలతో భూములు కొంటున్నారు. రెండవది అటవీ హక్కులు. 2006 అటవీ హక్కుల చట్టం వచ్చి 18 ఏళ్లు అయ్యింది. మందసలో 4000 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. మూడవది వలసలు. పని లేక ప్రతి ఇంటి నుంచి ఇద్దరు ముగ్గురు యువకులు ఒడిశా ఇటుక బట్టీలకు, సూరత్ వజ్రాల పరిశ్రమకు, గుజరాత్ కర్మాగారాలకు వెళ్తున్నారు.

ప్రశ్న 2: పలాస నియోజకవర్గంలో గతంలో ఆదివాసీల అభ్యున్నతికి చేసిన కృషి గురించి ఏమంటారు?
జవాబు: పలాస నియోజకవర్గంలో ఆదివాసీల అభ్యున్నతి కోసం దివంగత శాసనసభ్యులు జుత్తు జగన్నాయకులు కృషి చేశారు. ఆయన హయాంలో గిరిజన ప్రాంతాలకు చెందిన మారుమూల గ్రామాలకు సైతం రహదారి సౌకర్యం కల్పించారు. ఆ తర్వాత వైఎస్‌ఆర్సీపీ ప్రభుత్వంలో డాక్టర్ సిదిరి అప్పలరాజు రాష్ట్ర మంత్రిగా ప్రాతినిధ్యం వహించినప్పుడు ప్రధానంగా మందస, పలాస రూరల్ మండలంలో నివసించే గిరిజనుల అభ్యున్నతికి, వారి జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు కృషి చేశారు. కనీస, మౌలిక రంగ సౌకర్యాలు కల్పించడంలో కృషి చేశారు.

ప్రశ్న 3: గతంలో కొన్ని దశాబ్దాలు పాటు అధికారంలో ఉన్నవారు ఆదివాసీల కోసం ఏం చేశారు?
జవాబు: గతంలో ఈ ప్రాంతాన్ని కొన్ని దశాబ్దాలు పాటు వారసత్వ రాజకీయాలు చేస్తూ ప్రజా ప్రతినిధులుగా ఉన్నవారు ఆదివాసీల అభ్యున్నతికి గాని, ఉద్దానం ప్రాంత ప్రజానీకం జీవన ప్రమాణాలు మెరుగు పరచడానికి గాని కృషి చేయలేదు. తీవ్ర నిర్లక్ష్యం చేశారు. చివరకు సాగునీటి వనరులు కూడా అభివృద్ధి చేయలేకపోయారు. మహేంద్ర తనయ నది పరివాహక ప్రాంత అభివృద్ధిలో నాడు కామ్రేడ్ మార్పు పద్మనాభం వంటి పోరాట యోధుల కృషి ఫలితంగా కళింగ దళ్ సాగునీటి ప్రాజెక్టులు రూపుదాల్చాయి. ప్రశ్న 4: శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తి ఈ ప్రాంతంలో ఎలా ఉంది?
జవాబు: నాటి గిరిజన రైతన్న సాయుధ పోరాటంలో ఈ ప్రాంతానికి చెందిన ఆదివాసి బిడ్డలు మరియు ఉద్దానం ప్రాంతానికి చెందిన అగ్నికుల క్షత్రియులు, యాదవులు సమసమాజ స్థాపన కోసం నాటి బూర్జువా, భూస్వామ్య, పెత్తందారి, జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడి రాజ్య హింసకు బలి కాబడి అమరులైనారు. వారి త్యాగాల ఫలితంగా నేటికీ ఉద్దానంలో సమస్యల పట్ల పాలకవర్గాన్ని నిలదీసే తత్వం వారసత్వంగా కొనసాగుతోంది. ఆ త్యాగం ఫలితంగానే 1/70 చట్టం వచ్చింది. కానీ ఈ రోజు ఆ చట్టాన్ని సరిగా అమలు చేయడం లేదు. యువతకు ఆ చరిత్ర తెలియాలి. అందుకే ప్రతి గ్రామంలో అమరవీరుల స్మారక కార్యక్రమాలు జరుపుతారు. ఆ స్ఫూర్తిని బతికిస్తారు. ప్రశ్న 5: మీరు వామపక్ష అభ్యుదయ భావాల నుంచి వచ్చారు. ఎంపిపిగా ఉండి కూడా ప్రభుత్వ విధానాలను ఎలా చూస్తారు? జవాబు: పార్టీకి కట్టుబడి ఉంటాను కానీ ప్రజలకు ద్రోహం చేయను. వామపక్ష భావాలు అంటే పేదవాడి పక్షాన నిలబడటం. ఈ రోజు అటవీ సంరక్షణ సవరణ చట్టం 2023 వల్ల గ్రామసభ అనుమతి ప్రాముఖ్యత తగ్గింది. ఇది ఆదివాసీల హక్కులపై ప్రభావం చూపుతుంది. ఎంపిపిగా ప్రజల తరపున గొంతు విప్పకపోతే ద్రోహం అవుతుంది. "కుర్చీ కోసం నోరు మూయను, ప్రజల కోసం కుర్చీ వదులుతాను". ప్రశ్న 6: విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో మందస పరిస్థితి ఏంటి? ప్రభుత్వం ఏం చేయాలి? జవాబు: మూడు రంగాల్లోనూ మెరుగుపరచాల్సి ఉంది. మందసలో 42 గిరిజన ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. చాలా చోట్ల ఉపాధ్యాయుల కొరత ఉంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిపుణులైన వైద్యులు అవసరం. రక్తహీనత, పోషకాహార లోపంపై ప్రత్యేక కార్యాచరణ కావాలి. ఉపాధి హామీలో పనులు పెంచాలి. గిరిజన ఉత్పత్తులైన తేనె, చింతపండు, ఇప్పపూలు, నల్లేరును మధ్యవర్తులు తక్కువ ధరకు కొంటున్నారు. జిసిని పునరుజ్జీవింపచేసి, కనీస మద్దతు ధర ప్రకటించి, నేరుగా ప్రభుత్వమే కొంటే గిరిజన రైతుకు మేలు జరుగుతుంది. ప్రశ్న 7: అభివృద్ధి పేరుతో అడవుల్లో ప్రాజెక్టులు వస్తున్నాయి. దీనిపై అభిప్రాయం?
జవాబు: అభివృద్ధి కావాలి కానీ ఆదివాసీని భాగస్వామిని చేయాలి. ఏ ప్రాజెక్టు వచ్చినా గ్రామసభ అనుమతి తప్పనిసరి. తూర్పు కనుమల్లో బాక్సైట్, ఖనిజాల గురించి చర్చ జరుగుతోంది. "అడవి లేకుండా మేము లేము" అనేది సూత్రం. అడవిని నరికితే జలధారలు ఎండిపోతాయి. అందుకే ప్రజల అంగీకారంతో, పర్యావరణానికి ఇబ్బంది లేకుండా అభివృద్ధి జరగాలి. ప్రశ్న 8: ఆదివాసీ సంస్కృతి, భాష, సంప్రదాయాల పరిరక్షణకు ప్రభుత్వం ఏం చేయాలి? జవాబు: సంస్కృతే గుర్తింపు. "అరణ్యా దేవి నమస్తుభ్యం" అని అడవిని దేవతగా కొలిచే సంస్కృతి ఉంది. సవరల చీతికోలా నృత్యం, జాతపు పండుగలు, స్థానిక భాషలు నశిస్తున్నాయి. ప్రభుత్వం గిరిజన భాషను, చరిత్రను పాఠశాలల్లో బోధించాలి. గిరిజన కళాకారులకు ఆర్థిక సహాయం ఇవ్వాలి. ప్రతి మండలంలో గిరిజన సాంస్కృతిక కేంద్రం పెట్టాలి.

ప్రశ్న 9: గిరిజన మహిళల పరిస్థితి గురించి ఏమంటారు?
జవాబు: ఆదివాసీ మహిళలే అసలైన అడవి కాపరులు. వారే కట్టెలు తెస్తారు, నీళ్లు తెస్తారు, వనోత్పత్తులు సేకరిస్తారు. వారికి స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు, శిక్షణ ఇచ్చి గిరిజన ఉత్పత్తులను వారే నేరుగా మార్కెట్ చేయించాలి. మహిళా గ్రామసభలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. గర్భిణీలకు, బాలింతలకు ప్రత్యేక వైద్య శిబిరాలు పెట్టాలి.

ప్రశ్న 10: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల కోసం అనేక పథకాలు తెస్తున్నామంటున్నాయి. అవి అందుతున్నాయా?
జవాబు: పథకాలు ఉన్నాయి కానీ అమలులో లోపం ఉంది. ప్రధానమంత్రి జన్మన్, గిరిజన గ్రామాల అభివృద్ధి పేరుతో నిధులు వస్తున్నాయి. కానీ క్షేత్రస్థాయిలో రోడ్లు, తాగునీరు, విద్యుత్ సమస్యలు ఉన్నాయి. బడ్జెట్‌లో గిరిజన ఉప ప్రణాళిక నిధులు పూర్తిగా ఖర్చు కావాలి. ప్రతి గ్రామంలో సామాజిక తనిఖీ చేసి పారదర్శకత తేవాలి. ప్రశ్న 11: మందస ఆదివాసీల అభివృద్ధికి ప్రణాళిక ఏమిటి? జవాబు: మొదట అటవీ హక్కుల చట్టాన్ని 100 శాతం అమలు చేయాలి. ప్రతి ఆదివాసీ కుటుంబానికి సాగు భూమి పట్టా ఇవ్వాలి. గిరిజన యువతకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు పటిష్టంగా అమలు చేయాలి. గిరిజన ప్రాంతాల్లో వనోత్పత్తుల ప్రాసెసింగ్ కేంద్రాలు, చిన్న పరిశ్రమలు పెట్టి స్థానికులకే ఉపాధి ఇవ్వాలి. అధికారులు ప్రతి నెలా గ్రామాల్లో పర్యటించాలి. ప్రజలను భాగస్వాములను చేస్తేనే నిజమైన అభివృద్ధి సాధ్యం.

# రాజమండ్రిలో అభయ డే పేరుతో వైద్య బృందం, మెడికోల ర్యాలీ

**రాజమండ్రి** మెడికో ప్రియాంక హత్య కేసును ఖండించిన వైద్యులు
డాక్టర్లపై హత్యలు, దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్
రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదని నినాదాలు
కటారి నగర్ జంక్షన్ నుంచి ఐఎంఏ హాల్ వరకు రెండు కిలోమీటర్ల ర్యాలీ

# కనక తప్పెట్టలు ఘణ ఘణ మోగగ..సింహనాదములు శివమెత్తించగ...



**హైదరాబాద్:** ...భక్తి తోటి నీ మొక్కులు చెల్లించేదనమ్మా.......చల్లగా చూడమ్మా.....కాళికమ్మ.....అంటూ... అమ్మవారి ఊరేగింపులో భక్తజనుల వేడుకోలు.... బోనాల సందర్భంగా చప్పల్ బజార్ లో కాళికా అమ్మవారి ఉత్సవ వూరేగింపు ఆలయ చైర్మన్ లడ్డు యాదవ్ ఆధ్వర్యం లో ఘనం గా జరిగింది...భక్త జన సందోహంతో వీధులన్నీ ఆధ్యాత్మిక శోభ సంతరించుకొన్నాయి.... కాళికా అమ్మవారి కటాక్షం కోసం పడిగాపులు కాసిన జనం వాయిద్యాలు తప్పెట్ల మధ్య పరవశిస్తూ నృత్యం చేశారు..ఊరేగింపులో పాల్గొన్న భక్త జనులకు ఇబ్బంది కలుగ కుండా కాచిగూడ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కౌశిక్ సార్ ఆధ్వర్యం లో ట్రాఫిక్ పోలీస్ విజయ్ కుమార్. నారాయణ రెడ్డి సహకరించారు

# నేటి ప్రజావాణికి సెలవు.

**జనగామ, ఆగస్టు 9 (ప్రజా అక్షరం ప్రతినిధి):** బోనాల పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రభుత్వ సెలవు నేపథ్యంలో... నేటి (ఆగస్టు 10న) సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమం ప్రభుత్వ సెలవు కారణంగా నిర్వహించడం లేదని తెలుపనైనది. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి, నేటి ప్రజావాణి కార్యక్రమం కోసం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయానికి తమ వినతులు, సమస్యలకు సంబంధించిన దరఖాస్తులతో రావద్దని కోరనైనది.

# ఆషాఢ బోనాల వేడుకల్లో డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రెష్ యాదవ్

**అలియాబాద్, ఆగస్టు 9-- ప్రజా అక్షరం** అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని తుర్కపల్లి గ్రామంలో నిర్వహించిన ఆషాఢ బోనాల వేడుకల్లో మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రెష్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు



బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ శిరీష కృష్ణారెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్, కౌన్సిలర్లు గుర్కదీప సాయి కృష్ణ యాదవ్, సామల జశ్వంత్ రెడ్డి, నాయకులు వై.ఎస్. గౌడ్, బత్తుల కిషోర్ యాదవ్, ఏఎంసీ డైరెక్టర్ తుంకి బిక్షపతి పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ నాయకులు బండారి బాబు, కోడూరి దినేష్, నవీన్ రెడ్డి, రాఘవ రెడ్డి, చంద్ర రెడ్డి, ఊరడి వెంకటేష్, సాయి, కుడుముల వెంకటేష్, వేణుగోపాల్ రెడ్డి తదితరులు, పార్టీ కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల ఐక్యత చాటుతాం.. డాక్టర్ అప్పలరాజు వెంట నడుస్తాం"

**అక్రమ అరెస్టును ఖండిస్తూ శ్రీదేవి మేడంకు మత్స్యకార సంఘాల సంఘీభావం**
**కిడ్నీ ఆసుపత్రి నిర్మాణానికి కృషి చేశాం**
**రాష్ట్ర స్థాయిలో మత్స్యకారులను ఏకం చేస్తాం**
**తప్పుడు కేసులతో అణచివేయడం బాధాకరం**

**పలాస, ఆదివారం ఆగస్టు 9:**



మాజీ మంత్రి, మత్స్యకార నాయకుడు డాక్టర్ సీదిరి అప్పలరాజుపై కూటమి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు, అరెస్టును ఖండిస్తూ మత్స్యకార సంఘాలు సంఘీభావం ప్రకటించాయి. మత్స్యకార నాయకుడి ఎదుగుదలను ఓర్వలేక రాజకీయ కక్షతోనే ఆయనపై కుట్రలు పన్నారని మత్స్యకారులు ఆరోపించారు.
ఆదివారం పలాస లోని వైఎస్ఆర్సిపి ప్రగతి భవన్ వద్ద జిల్లా నలుమూల నుంచి విచ్చేసిన మత్స్యకారుల ప్రతినిధులు రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ సిదిరి అప్పలరాజు సతీమణి శ్రీదేవిని కలసి తమ సంఘీభావాన్ని తెలియజేశారు.
మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల కోసం నిరంతరం పోరాడిన నాయకుడిపై జరుగుతున్న చర్యలను తీవ్రంగా ఖండించారు. మత్స్యకారులంతా ఐక్యంగా ఉంటామని, రానున్న రోజుల్లో డాక్టర్ సీదిరి అప్పలరాజు వెంట నడుస్తూ ఆయన విజయానికి అండగా నిలుస్తామని నాయకులు స్పష్టం చేశారు. మత్స్యకారుల ఐక్యత, సత్తాను రాష్ట్ర స్థాయిలో చాటిచెబుతామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సీదిరి అప్పలరాజు సతీమణి సీదిరి శ్రీదేవి మాట్లాడుతూ.. తన భర్త గౌరవప్రదమైన వైద్య వృత్తిలో కొనసాగుతూ ఎంతోమంది ప్రాణాలను కాపాడారని, అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. తమ ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన వారిలో ఎక్కువ మంది కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న మత్స్యకారులే ఉండేవారని, వారి బాధలను చూసి రాజకీయాల్లోకి వస్తే మరింత విస్తృతంగా సేవ చేయవచ్చని డాక్టర్ అప్పలరాజు భావించారని చెప్పారు. ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారిని ఒప్పించి కిడ్నీ బాధితుల కోసం ఆసుపత్రి నిర్మాణానికి కృషి చేసిన ఘనత డాక్టర్ అప్పలరాజుకే దక్కుతుందని శ్రీదేవి తెలిపారు. మత్స్యకారులు తన భర్తపై చూపిస్తున్న ఆదరాభిమానాలను జీవితాంతం మరువలేమని, అందరి దీవెనలు, ఆశీస్సులతో డాక్టర్ అప్పలరాజు త్వరలోనే విడుదలై ప్రజల మధ్యకు వస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. మత్స్యకార ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, పుక్కల గుర్రయ్య నాయుడు అధ్యక్షత వహించారు. మత్స్యకార కులాల మధ్య ఐక్యత కోసం పనిచేస్తామని, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుపై జరుగుతున్న పరిణామాలను రాష్ట్ర స్థాయిలోని మత్స్యకార సంఘాల దృష్టికి తీసుకెళ్లి వాస్తవాలను వివరిస్తామని నాయకులు తెలిపారు. ఐక్యవేదిక నాయకుడు అంబటి ఆనందరావు మాట్లాడుతూ.. ప్రతి మత్స్యకార గ్రామంలో గంగమ్మ తల్లి పూజలు నిర్వహిస్తూ, డాక్టర్ సీదిరి అప్పలరాజుపై జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరిస్తామని అన్నారు. ఆయనపై జరుగుతున్న విషప్రచారాన్ని తిప్పికొడతామని స్పష్టం చేశారు. ప్రముఖ న్యాయవాది మూగి గురుమూర్తి మాట్లాడుతూ.. తన న్యాయవాద వృత్తిలో ఎన్నో కేసులు చూశానని, అయితే ఇలాంటి కేసులను చూడటం ఇదే మొదటిసారని అన్నారు. ఒక మత్స్యకార నాయకుడు ఎదుగుతున్నాడనే కారణంతో ఇంత దారుణంగా అణచివేసే ప్రయత్నం చేయడం, తప్పుడు కేసులు పెట్టడం బాధాకరమన్నారు. మత్స్యకారులంతా ఐక్యంగా కలిసి పోరాటం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డొంక విద్యాసాగర్, ఎస్. వెంకన్న, తిర్రి రాజారావు తదితర మత్స్యకార ఐక్యవేదిక నాయకులు, వివిధ మత్స్యకార గ్రామాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి...!

## - బచ్చన్నపేట ఎస్సై శ్రీకాంత్...!!

**బచ్చన్నపేట ఆగస్టు 9 ( ప్రజా అక్షరం ప్రతినిధి):** జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని పోచన్నపేట గ్రామానికి చెందిన జూల సత్యనారాయణ... అనే వ్యక్తి జూన్ 26వ తేదీన తన మొబైల్ ఫోన్‌కు వాట్సాప్ ద్వారా వచ్చిన తెలియని అప్లికేషన్‌ను...? ఇన్‌స్టాల్ చేయడం వల్ల తన యాక్సిస్ బ్యాంక్ ఖాతా నుంచి 43,000 కోల్పోయారు. వెంటనే బచ్చన్నపేట పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు సత్వరమే స్పందించి నిందితుడి ఖాతాలోకి వెళ్లిన 43,000 మొత్తాన్ని హోల్డ్ చేయించారు. అనంతరం అవసరమైన ప్రక్రియను పూర్తి చేసి, కోల్పోయిన మొత్తం 43,000ను ఆదివారం రోజున బాధితుడికి తిరిగి అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా బచ్చన్నపేట ఎస్ఐ శ్రీకాంత్ మాట్లాడుతూ సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలియని లింకులను ఓపెన్ చేయొద్దని తెలిపారు మరియు పోలీస్ సిబ్బంది సకాలంలో స్పందించి, బాధితుడి నగదును హోల్డ్ చేయించి తిరిగి ఇప్పించేందుకు కృషి చేసినందుకు బాధితుడు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజలకు వాట్సాప్ లేదా ఇతర సోషల్ మీడియా ద్వారా వచ్చే తెలియని అప్లికేషన్లను ఇన్‌స్టాల్ చేయవద్దు. ఓటీపీ లు, బ్యాంక్ వివరాలు, పిన్ నంబర్లు ఎవరికీ తెలియజేయవద్దని సైబర్ మోసం జరిగిన వెంటనే ఆలస్యం చేయకుండా 1930కు కాల్ చేయండి..లేదా బచ్చన్నపేట పోలీస్ స్టేషన్‌కు 8712685205, 8712685046 నంబర్‌కు వెంటనే సమాచారం ఇవ్వాలని...తెలిపారు.



## తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా బోనాలు

# ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి



**శివ్వంపేట :** శివ్వంపేట మండలంలోని ఎమ్మెల్యే స్వగ్రామమైన గోమారం గ్రామంలో బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలోని గ్రామదేవతలకు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. అమ్మవారికి బోనాలు సమర్పించిన అనంతరం ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారుపాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలపై అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్ర గౌడ్, వాకిటి హనుమంతు రెడ్డి, కుంట లక్ష్మణ్, బిక్షపతి రెడ్డి, నవీన్, దేవేందర్, నగేష్, విజయ్ గౌడ్, వెంకటేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# మావోయిజం లేదు డ్రగ్స్ సమస్యే

# నేడు ప్రధానం డీజీపీ సీవీ ఆనంద్



**వరంగల్ :** రాష్ట్రంలో మావోయిస్టుల ప్రముఖులతో పాటు క్యాడర్ లొంగిపోవడంతో మావోయిజం ప్రభావం ఇక లేదని డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. నేడు డ్రగ్స్ సమస్య ప్రధానంగా ఉందని వెల్లడించారు. ఆదివారం వరంగల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.తన ట్రైనీ ఐపీఎస్ వరంగల్ నుంచే ప్రారంభమయ్యిందని గుర్తు చేశారు. ఆ రోజుల్లో ఇంటి నుంచి బయటకు వెళ్తే, తిరిగి వస్తామా అన్నంతగా నక్సల్స్ ప్రభావం ఉండేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో 2010 నుంచి మావోయిజం తగ్గిందని అన్నారు. లొంగిపోయిన మావోలతో ములుగులో సోమవారం ఒక కార్యక్రమాన్ని చేపట్టామని వివరించారు. లొంగిపోయిన, మావో బాధితుల కోసం ఒక ఆప్ తయారు చేశామని వెల్లడించారు. 1992-96 మధ్య చనిపోయిన వారికి ఎక్స్ గ్రేషియా కొంత తక్కువ వచ్చిందని తమ దృష్టికి వచ్చిందని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

నార్కొటిక్ బ్యూరో, ట్రాఫిక్, సీఐడీకి చెందిన వారితో కలిసి ఒక బృందంగా ఏర్పడి జిల్లాల పర్యటనలు చేస్తు న్నామని డీజీపీ ఆనంద్ తెలిపారు.

## ఆదివాసీలు జల్ జంగల్ జమీన్ అని నినదించిన పోరాట యోధుడు కుమ్రం భీం తెగువకు ప్రతిరూపాలు కేటీఆర్



ప్రకృతి పరిరక్షకులు, విభిన్న సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు ఆదివాసీలు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అడవులను, చెట్లను, పుట్టలను, జంతువులను ప్రేమించే, పూజించే ఆదివాసీలు... 'జల్, జంగల్, జమీన్' అని నినదించిన పోరాట యోధుడు కుమ్రం భీం తెగువకు ప్రతిరూపాలు అని తెలిపారు.ఎస్టీల అభ్యున్నతి కోసం కేసీఆర్ ప్రభుత్వం ఎస్టీ రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో తీర్మానం చేసిందని, ఆ తర్వాత ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు.. తండాలను, గిరిజన గూడేలను గ్రామ పంచాయితీలు చేసిందని అన్నారు..హైదరాబాద్ నడిబొడ్డున బంజారాహిల్స్‌లో ఆదివాసీ ఆత్మగౌరవాన్ని చాటిచెప్పే విధంగా.. కుమ్రం భీం ఆదివాసీ భవనాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిందని అన్నారు.

ఆసిఫాబాద్ జిల్లాకు కుమ్రం భీం పేరు పెట్టడమే కాకుండా, జోడేఘాట్‌లో సుందరమైన స్మృతి వనాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు.తండాలకు, గూడేలకు స్వచ్ఛమైన మంచినీరు సరఫరా చేయడం, ఎస్టీ గురుకులాలు, కాలేజీల సంఖ్య పెంచడం, అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ అందించడం, సీఎం ఎస్టీఈఐ స్కీం ద్వారా గిరిజన బిడ్డలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం వంటి ఎన్నో కార్యక్రమాలు కూడా కేసీఆర్ హయాంలోనే జరిగాయని గుర్తుచేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా..

ఆదివాసీ సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు.

## మీకోసం అసెంబ్లీలో కొట్లాడతాం మీరు ఈ ప్రభుత్వ ద్రోహాన్ని గమనించండి విద్యార్థులతో హరీశ్‌రావు



**సిద్దిపేట:** నవజీవన్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రతిభ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన దళిత విద్యార్థులకు అవార్డులు అందజేసి, వారిని ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో హరీశ్‌రావు మాట్లాడు తూ.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీ వన్ రామ్ లాంటి మహనీయులు కల్పించిన రిజర్వేషన్ల వల్లే మనమంతా చదువుకుని ఉన్న త స్థానాల్లో ఉన్నామని తెలిపారు. ఆ రిజ ర్వేషన్ల ఫలాలతో గౌరవంగా బతుకుతున్న మనం తిరిగి సమాజానికి ఏదో ఒకటి చేయా లనే బాధ్యతను పదేళ్ల క్రితమే గుర్తించి సిద్ది పేటలో మాదిగ సామాజిక వర్గం ఉద్యో గులంతా కలిసి 'న్యూస్' సొసైటీని స్థాపించడం అభినందనీయమని కొనియాడా రు.నాకు సమాజం ఏం చేసింది అని అడిగేవాళ్లే ఎక్కువ ఉన్న ఈ రోజుల్లో, మేము సమాజానికి ఏం చేయగలం అని ఆలోచించి, ఉద్యోగులు తమ వేతనం నుంచి ప్రతినెలా వెయ్యి రూపాయలు పక్కనపెట్టి 10 లక్షల రూపాయల నిధిని ఏర్పాటు చేయడం గర్వ కారణమని హరీశ్‌రావు అన్నారు. ఫీజులు కట్టలేని పేద విద్యార్థులకు అండగా నిలబ డుతూ, ప్రతి సంవత్సరం స్కాలర్‌షిప్స్ ఇవ్వడం రాష్ట్రానికే ఆదర్శమని అన్నారు. ఐదే ళ్ల క్రితం ఫీజు కట్టలేక నా దగ్గరకు వచ్చిన హౌసింగ్ బోర్డుకు చెందిన రోహిత్ అనే అబ్బాయికి నేను సహాయం చేశానని తెలి పారు. ఇప్పుడు ఆ అబ్బాయికి ఏడాదికి 6 లక్ష ల జీతం వస్తోందని పేర్కొన్నారు. ఇచ్చాడని అన్నారు. కష్టపడి పైకొచ్చిన ఆ అబ్బాయి ఆలోచనా విధానం అందరికీ స్ఫూర్తిదాయకమని చెప్పారు.

## సీనియర్ సిటిజన్లే టార్గెట్‌గా సైబర్ కేటుగాళ్ల

### కొత్త మోసాలకు పాల్పడుతున్నారు సీపీ సజ్జనార్



**గద్వాల:** మహారాష్ట్ర, కర్ణాటకలో వర్షాలు తగుముఖం పట్టడంతో ఆల్మట్టి, నారాయణ పూర్ డ్యాంలో నుంచి జూరాల డ్యాంకు వరద ఉధృతి తగ్గుముఖం పట్టడంతో జూరాల గేట్లు మూసి వేసినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. అయితే జూరాల ప్రాజెక్టుకు ఇన్ ఫ్లో 80000 క్యూసెక్కులు వస్తుండగా దిగువకు 39 608 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.ఆరు యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుంది. జూరాల పూర్తిస్థాయి నీటిమట్టం 318. 516 మీటర్లు కాగా ప్రస్తుతం 317. 51 మీటర్లుగా నమోదయింది. టీఎంసీలలో జూరాల ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 7. 663 టీఎంసీలు ఉంది. వరదలు తగ్గుముఖం పట్టడంతో జూరాల గేట్లు మూసివేశారు విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుంది.

## శ్రీశైలం జలాశయానికి తగ్గిన వరద



**శ్రీశైలం:** శ్రీశైలం రిజర్వాయర్‌కు వరద తగ్గుముఖం పట్టింది. జూరాల నుంచి శ్రీశైలానికి 36,233 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. శ్రీశైలం జలాశయం ప్రస్తుత నీటి మట్టం 878.20 అడుగులు. పూర్తిస్థాయి నీటమట్టం 885 అడుగులు. ప్రస్తుతం రిజర్వాయర్ నీటి నిల్వ 178 టీఎంసీలు కాగా, పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలు. అధికారులు విద్యుత్ ఉత్పత్తి చేసి 38,369 క్యూసెక్కులను విడుదల చేశారు.

## ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో తప్పుడు విధానాలకు పాల్పడితే సహించం మాజీ ఎమ్మెల్యే



**సూర్యపేట :** వ్యక్తిగత కక్షలు రాజకీయ కారణాలతో మిగిలిన డబుల్ బెడ్ రూంఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియల్లో తప్పుడు విధానాలకు పాల్పడితే చూస్తూ ఊరుకో బోమని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్‌వెల్లడించారు. ఆదివారం కోదాడలోని తన నివాసంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.మూడు సంవత్సరాల అనంతరం బాలాజీ నగంలోని 560 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు గాను 548 లబ్ధిదారులకు అధికారులు పట్టాలు పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. ఇక మిగిలిన లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేయాలని అధికారులకు సూచించారు. నిరుపేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరాలని ఆకాంక్షతో తాను శాసనసభ్యుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో పారదర్శకంగా కలెక్టర్ పర్యవేక్షణలో లబ్ధిదారులు ఎంపిక పూర్తి చేశానని తెలిపారు.అయితే అధికారుల నిర్లక్ష్యంతో పలు సాంకేతిక కారణాల దృష్ట్యా పట్టాలు పంపిణీ చేయలేకపోయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తాము తక్షణమే మౌలిక వసతులు పూర్తి చేసి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని పలు మార్లు ఆందోళన చేశామన్నారు. అండర్ డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా నడుస్తుందని నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని విమర్శించారు. మీడియా సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎస్ కే నయీమ్, కౌన్సిలర్ చీమ నరేష్, ఉపేందర్ గౌడ్, అలవాల వెంకట్, ఉపేందర్, కరీముల్లా పాల్గొన్నారు.

# యాదాద్రి భువనగిరి జిల్లాలో 54 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టివేత నలుగురు అరెస్టు

**యాదాద్రి భువనగిరి:** యాదాద్రి భువనగిరి జిల్లాలో భారీగా మెఫెడ్రోన్ డ్రగ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బీబీనగర్ పోలీసులు, ఎస్‌వోటీ యాదాద్రి-భువనగిరి పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో 27 కిలోల మెఫెడ్రోన్‌ను పట్టుకున్నారు. దీని విలువ సుమారు రూ.54 కోట్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో నలుగురిని అరెస్టు చేశారు. మరో నలుగురు పరారీలో ఉన్నారని, వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నట్లు వెల్లడించారు.

యాదాద్రి భువనగిరి ఎస్పీ అక్షాంశ్ యాదవ్ ఆదేశాల మేరకు డ్రగ్స్ అక్రమ తయారీ, రవాణా, విక్రయాలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ క్రమంలో విశ్వసనీయ సమాచారం అందడంతో ఆగస్టు 8న కొండమడుగు గ్రామ శివారులో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వీఎ-49-జఔ-1313 నంబరు గల ఫార్చ్యూనర్ కారును ఆపి తనిఖీ చేయగా 27 కిలోల మెఫెడ్రోన్‌తోపాటు సుమారు 40 కిలోల అసిటోన్ లభించింది.పోలీసుల విచారణలో కొండమడుగులోని వేటుకూరి ల్యాబ్స్‌లో ఆగస్టు 5 నుంచి 7వ తేదీ వరకు మెఫెడ్రోన్‌ను అక్రమంగా తయారు చేసినట్లు వెల్లడైంది. అనంతరం దాన్ని కొండమడుగు నుంచి నాగ్‌పూర్‌కు తరలించి అక్కడ పంపిణీ చేసేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల సమాచారంతో పోలీసులు వేటుకూరి ల్యాబ్స్‌లో తనిఖీలు నిర్వహించారు. డ్రగ్ తయారీలో ఉపయోగించిన రియాక్టర్, సెంట్రిఫ్యూజ్ తదితర పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. చట్టపరమైన ప్రక్రియ పూర్తయిన తర్వాత ల్యాబ్‌ను సీజ్ చేసేందుకు చర్యలు



తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

**నలుగురి అరెస్టు**

అరెస్టయిన వారిలో మహారాష్ట్ర నాగ్‌పూర్‌కు చెందిన చేతన్ మధుకర్ మెష్రామ్ (49), అసోంలోని మారిగావ్‌కు చెంది

న ముజామల్ హక్ (25), నాగ్‌పూర్‌కు చెందిన ఆకాశ్ అశో క్ గవాండే (31), హైదరాబాద్ చందా నగర్‌కు చెందిన ఉపద్రష్ట రమణమూర్తి (65) ఉన్నారు.చేతన్ డ్రగ్ తయారీకి ఆర్గనైజర్‌గా, ఆర్థిక సహకారం అందించిన వ్యక్తిగా.. ముజామల్ హక్ తయారీ ప్రక్రియలో సహ కరించిన వ్యక్తిగా.. ఆకాశ్ గవాండే అక్రమ రవాణాలో సహకరించిన వ్యక్తిగా.. రమణ మూర్తి వేటుకూరి ల్యాబ్స్ ఇన్‌చార్జిగా వ్యవహరించినట్లు పోలీసులు తెలిపారు.

**మరో నలుగురి కోసం గాలింపు**

ఈ కేసులో ఎం.డి. అయూబ్ అలీ (అసోం), చందా ప్రదీప్ ఠాకూర్ (నాగ్‌పూర్), గోపాల్ సిర్పట్ పటేలియా (నాగ్‌పూర్), యేటుకూరి రామరాజు (పీర్జాదిగూడ, మేడిపల్లి) పరారీలో ఉన్నారు. వీరిలో అయూబ్ అలీ ల్యాబ్ ఏర్పాటు, ముడి పదార్థాల సమీకరణ, కెమిస్ట్ ఏర్పాటులో కీలకంగా వ్యవహరించినట్లు.. ప్రదీప్ ఠాకూర్, గోపాల్ పటేలియా డ్రగ్ పెడ్లర్లుగా ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. యేటుకూరి రామరాజు ల్యాబ్ యజమానిగా ఉన్నట్లు తెలిపారు.

**భారీగా స్వాధీనం**

పోలీసులు స్వాధీనం చేసుకున్న వాటిలో 27 కిలోల మెఫెడ్రోన్, 40 కిలోల అసిటోన్ లిక్విడ్, ఆరు సెల్‌ఫోన్లు, ఫార్చ్యూనర్ కారు, డ్రగ్ తయారీకి ఉపయోగించిన రియాక్టర్, సెంట్రిఫ్యూజ్, ఇతర పరికరాలు ఉన్నాయి. ఎన్‌డీపీఎస్ చట్ట నిబంధనలకు అనుగుణంగా, పంచుల సమక్షంలో చట్టపరమైన ప్రక్రియను పాటిస్తూ ఆపరేషన్ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. అరెస్టయిన నిందితులను కోర్టులో హాజరుపరిచారు. కేసులో దర్యాప్తు కొనసాగుతోంది.

**డ్రగ్స్‌పై కఠిన చర్యలు: ఎస్పీ**

జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ తయారీ, రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అక్షాంశ్ యాదవ్ తెలిపారు. కాపాడటం అందరి బాధ్యతన్నారు.

# అమెరికాలో రోడ్డు ప్రమాదం

## తిరుపతికి చెందిన యువకుడు మృతి

**అమెరికా:** అమెరికాలో విషాదం నెలకొంది. ఒహాయో రాష్ట్రంలోని క్లీవ్‌లాండ్‌లో జరిగిన యాక్సిడెంట్‌లో ఏపీకి చెందిన తెలుగు విద్యార్థి మృతిచెందాడు. అతను ప్రయాణిస్తున్న కారును ఓ పికప్ ట్రక్కు ఢీకొట్టడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

వివరాల్లోకి వెళ్తే.. తిరుపతి జిల్లా చిట్వేల్ మండలం జెట్టివారిపాలెం గ్రామానికి చెందిన దిలీప్ కుమార్ కొన్నేళ్ల క్రితం ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లాడు. కెంట్ స్టేట్ యూనివర్సిటీలో ఎంఎస్ చేస్తున్నాడు. ఈ క్రమంలో అతను రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇదిలా ఉంటే ఈ ప్రమాదంపై న్యూయార్క్‌లోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. దిలీప్ కుమార్ అకాల మరణంపై తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఈ



క్లిష్ట సమయంలో బాధిత కుటుంబానికి తోడుగా ఉంటామని తెలిపింది. దిలీప్ కుటుంబసభ్యులతో సంప్రదింపులు జరుపుతున్నామని.. మృతదేహాన్ని వీలైనంత తొందరగా స్వగ్రామానికి చేర్చేలా ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు.

# ఆస్పత్రిలో చికిత్స పొందుతూ

## మెడికో విద్యార్థి ప్రియాంక మృతి

**హైదరాబాద్ :** మద్యం మత్తులో ఉన్న ఇద్దరు యువకులు కారుతో ఢీ కొన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డ మెడికోవిద్యార్థి ప్రియాంక ఆదివారం సాయంత్రం మృతి చెందింది. గత వారం రోజులుగా సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న ఆమె పరిస్థితి మరింత విషమించి మృతి చెందింది. ఏపీలోని రాజమహేంద్రవరంలో ఈనెల 3న రాత్రి సినిమామాల్ నుంచి తన స్నేహితుడితో బయటకు వచ్చిన ప్రియాంక వాహనాన్ని మద్యం మత్తులో ఉన్న దస్వంత్, ఆండ్రూ జోసఫ్ కారుతో ఢీ కొట్టారు. దీంతో ప్రియాంక తలకు తీవ్ర గాయాలతో ఆమెను స్థానిక ఆసుపత్రిలో అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. అప్పటి నుంచి ఆమెకు వైద్యులు వెంటిలేటర్‌పై చికిత్స అందజేశారు. ఆమెను బతికించేందుకు వైద్యులు శతవిధాలా ప్రయత్నించినప్పటికీ ఆరోగ్యం సహకరించకపోవడంతో ఆమె తుదిశ్వాస విడిచింది. ఈ కేసులో ఇప్పటికే ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా వారికి 14 రోజుల పాటు రిమాండ్ విధించింది.



# తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

## ఆక్టోపస్ భవనం వరకు క్యూలైన్‌లో భక్తులు




**తిరుమల :** గోవిందా హరి గోవిందా.. గోకుల నందా గోవిందా అంటూ తిరుమల లో భక్తులు స్వామివారి దర్శనం కోసం భారీ సంఖ్యలో క్యూలైన్‌లలో నిలబడ్డారు. వారాంతపు సెలవు దినాలు కావడంతో శని, ఆదివారాలు భక్తులతో కిటకిటలాడాయి. శనివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కంపార్టుమెంట్లు నిండిపోయి ఆక్టోపస్ భవనం వరకు క్యూలైన్‌లో నిలబడ్డారు. వేంకటేశ్వరస్వామిని 87,658 మంది భక్తులు దర్శించుకోగా 40,606 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు చెల్లించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 4.13 కోట్ల ఆదాయం వచ్చిందని టీటీడీ ఆలయ అధికారులు తెలిపారు.

4.15 లక్షల లడ్డూలను విక్రయించామని, 3.09 లక్షల మందికి అన్న ప్రసాదం అందించామని వివరించారు.

# నాటు బాంబులు వేసి చోరీకి యత్నం

## అడ్డుకున్న వాచ్‌మెన్ దారుణ హత్య

**చిత్తూరు జిల్లా** ఏపీలోని చిత్తూరు జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. అర్ధరాత్రి నాటు బాంబులు వేసి ఫాంహౌస్‌లో దోపిడీకి ప్రయత్నించిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరు గ్రామీణ మండలం మంగాపురానికి చెందిన పట్టాభి నాయుడు అమెరికాలో స్థిరపడ్డాడు. ఆయన స్వగ్రామంలో ఉన్న మామిడి తోటలో ఫాంహౌస్ నిర్మించుకున్నాడు. దానిని తన చెల్లి విజయ, బావ వెంటకేష్ నాయుడు చూస్తున్నారు. కాగా, అర్ధరాత్రి ఫాంహౌస్‌లోకి చొరబడిన దుండగులు రెండు కుక్కలకు మత్తు మందు ఇచ్చి చోరీకి ప్రయత్నించారు. ఈ క్రమంలో వాచ్‌మెన్ ఆనందరావు(52) అడ్డుకోవడంతో గొంతుకోసి హతమార్చారు. అనంతరం కిటికీపై నాటు బాంబులు వేశారు. భయపడిపోయిన విజయ దంపతులు గట్టిగా అరవడంతో దుండగులు పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# మహిళా ఎస్ఐపై దాడి కేసు వైసీపీ నేత చింతాడ

## రవికుమార్‌కు ఆగస్టు 21 వరకు రిమాండ్



**శ్రీకాకుళం:** మహిళా ఎస్ఐపై దాడి కేసులో వైసీపీ నేత చింతాడ రవికుమార్‌కు ఆగస్టు 21వ తేదీ వరకు శ్రీకాకుళం కోర్టు రిమాండ్ విధించింది. 13 రోజుల పాటు మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారు. అనంతరం రవికు మార్‌ను జిల్లా జైలుకు పోలీసులు తరలించారు. అతడిని రోడ్డుపై నడిపించుకుంటూ శ్రీకాకుళం కోర్టుకు పోలీసులు తీసుకుచ్చారు. పాతపట్నంలో వైద్య పరీక్షల అనంతరం న్యాయస్థానంలో పోలీసులు హాజరుపరిచారు. మహిళా ఎస్ఐపై దాడి చేసిన కేసులో నిన్న చింతాడరవిని పోలీసులుఅరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

# శ్రీశైల మల్లన్న భక్తులకు అలర్ట్

## ఆ సేవలు నిలిపివేత



**నంద్యాల:** శ్రీశైలం మల్లన్న ఆలయానికి భక్తులు పోటెత్తారు. వరుస సెలవుల నేపథ్యంలో భక్తులు భారీగా ఆలయానికి తంలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. భక్తులు భారీగా తరలి రావడంతో స్వామివారి దర్శనానికి సుమారు 2 గంటల సమయం పడుతుంది. అలాగే, వరుణయాగం సందర్భంగా ఈరోజు , ఆర్జిత సేవలు, స్పర్శ దర్శనాలు నిలిపివేశారు. భక్తుల వాహనాలు ఎక్కువగా రావడంతో శ్రీశైలంలో భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది. దీంతో శ్రీశైలం రహదారుల్లో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. శ్రీశైలం టోల్‌గేట్ నుంచి ముఖ ద్వారం వరకు వాహనాల రాకపోకలు స్తంభించాయి. కిలోమీటర్ల కొద్దీ వాహనాలు నిలిచిపోయి భక్తులు ఇబ్బందులు పడు తున్నారు.

# అరాచకాలు అక్రమాలు చేసే వైసీపీ

## కనుమరుగైపోయింది మంత్రి డీబీవీ స్వామి

**ప్రకాశం జిల్లా :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పారదర్శకంగా జరిగిన డీఎస్సీలో వైసీపీ నేతలు నానాయాగి చేస్తున్నారని ధ్వజమెత్తారు. డీఎస్సీ అడ్డుకోవడం కోసం 350కు పైగా కేసులను వైసీపీ నేతలు వేశారని ఆగ్రహించారు. ఆ కేసులన్నీ కోర్టులు పరిష్కరించాయని వెల్లడించారు. ఈరోజు పకాశం జిల్లాలో మంత్రి డీబీవీ స్వామి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఎప్పుడు డీఎస్సీ ఇచ్చిన తెలుగుదేశం ప్రభుత్వంలోనే ఇచ్చామని వ్యాఖ్యానించారు.

9 నెలలు ఉద్యోగాలు చేసిన తర్వాత ఏదో అన్యాయం జరిగిందని వైసీపీ నాయకులు ఇప్పుడు మాట్లాడటం విడ్డూరంగా ఉందని



మంత్రి ఎద్దేవా చేశారు. ఏపీ హైకోర్టు కూడా వైసీపీ నేత డీఎస్సీపై వేసిన పిల్‌ను కొట్టివేసిందని ప్రస్తావించారు. పార్లమెంట్‌లో వాయిదా తీర్మానం పెడితే అక్కడ కూడా తిరస్కరించారని చెప్పుకొచ్చారు. అన్యాయం జరిగిందని ఒక్క డీఎస్సీ అభ్యర్థి కూడా బయటకు రావడం లేదని.. కానీ డీఎస్సీపై ఆయా గ్రామాల్లో వైసీపీ నాయకులే ర్యాలీలు చేయడం విడ్డూరంగా ఉందని సెటైర్లు గుప్పించారు.

వైసీపీ అక్రమాలపై ఉద్యోగస్తులు తిరగపడుతున్నారని మంత్రి అన్నారు. అరాచకాలు, అక్రమాలు చేసే ఆ పార్టీ కనుమరుగైపో యిందని విమర్శించారు. మంత్రి నారా లోకేశ్ రాజీనామా అడిగే ముందు వైసీపీ నాయకులకు అసలు బుద్ధుందా అని ప్రశ్నించారు. తలకిందులుగా తపస్సు చేసినా వైసీపీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని మంత్రి డోలా బాల వీరాంజనే యస్వామి పేర్కొన్నారు.

# ఘోర విషాదం పిడుగు పడి

## ఇద్దరు మహిళలు మృతి


**శ్రీకాకుళం:** జిల్లాలో ఇవాళ భారీ వర్షాలతో కూడిన పిడుగులు బీభత్సం సృష్టించాయి. మందస ఏజెన్సీ ప్రాంతంలోని పాతకోటలో పిడుగు పడి ఇద్దరు మహిళలు మృతిచెందగా.. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. మృతులను కట్ట సుమిత్రి, సవర జోరాగా గుర్తించారు. బాధితులంతా వ్యవసాయ పనులు చేస్తుండగా.. ఒక్కసారిగా పిడుగు పడింది. దీంతో ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. క్షతగాత్రులను స్థానికులు వెంటనే సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనతో పాతకోటలో విషాదఛాయలు అలుముకోగా.. మృతుల కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కాగా, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఉత్తరాంధ్రలో వాతావరణం మారింది. శ్రీకాకుళం జిల్లాతో పాటు పలుచోట్ల పిడుగులతో కూడిన వర్షాలు



కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాల కింద ఉండకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచిస్తున్నారు.

# తెల్ల దుస్తులు ధరించి ఏనుగులకు

## కనిపించొద్దు డీఎఫ్‌వో ప్రసన్న



**బొబ్బిలి:** విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం పిరిడి గ్రామ చెరువులో అడవి ఏనుగుల గుంపు తిష్టవేసింది. ఈ మేరకు పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు హెచ్చరించారు. తెల్లని దుస్తులు ధరిస్తే గజరాజులకు కనిపించకుండా ఉండాలని, రెచ్చగొట్టే చర్యలకు పాల్పడవద్దని సూచించారు. వాటిని గ్రామాల నుంచి దూరంగా తరిమేందుకు శిక్షణ పొందిన కుంకి ఏనుగులను రంగంలోకి దించినట్లు డీఎఫ్‌వో ప్రసన్న పేర్కొన్నారు. వాటిని చూడగానే అడవి ఏనుగులు భయంతో పరుగులు తీస్తున్నట్లు గుర్తించామన్నారు. శిక్షణ పొందిన ఏనుగుల సహాయంతో అడవి ఏనుగులను మచ్చిక చేసే పరిస్థితిని కల్పిస్తున్నామని డీఎఫ్‌వో ప్రసన్న తెలిపారు. ప్రస్తుతం పిరిడి చెరువు పరిసర ప్రాంతాల్లో ఏనుగుల కదలికలను అటవీశాఖ సిబ్బంది నిశితంగా పరిశీలిస్తోందని పేర్కొన్నారు. గ్రామాల వైపు అవి రాకుండా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. రెండు రోజుల పాటు ఏనుగులు సంచరిస్తున్న పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎఫ్‌వో సూచించారు. ఏనుగులు కనిపించినప్పుడు వాటి వద్దకు వెళ్లడం, ఫొటోలు లేదా వీడియోల కోసం దగ్గరగా వెళ్లడం చేయరాదని హెచ్చరించారు. గుంపుగా వెళ్లి ఏనుగులను తరిమేందుకు అందించాలని డీఎఫ్‌వో ప్రసన్న సూచించారు.

# ఆదివాసీల అభ్యున్నతికి సీఎం చంద్రబాబే

## ప్రధాన కారణం మంత్రి సంధ్యారాణి




**విజయవాడ:** నేడు ఆదివాసీలు గౌరవంగా జీవిస్తున్నారంటే అందుకు సీఎం చంద్రబాబు నాయుడు ప్రధాన కారణమని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. ఆదివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా విజయవాడలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం అనేది గతంలో ఎవరూ చూడలేదన్నారు. సీఎం చంద్రబాబు వచ్చాకే.. ఆదివాసీ దినోత్సవం సంబరంగా జరుగుతుందని గుర్తుచేశారు. నేడు గిరిజనులు బాగా చదువుకుని అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. నాడు ఎన్టీఆర్, తరువాత చంద్రబాబు హయాంలోనే గిరిజనులకు మేలు జరిగిందని చెప్పారు. స్కూల్ అఫ్ ఎక్సలెన్సీ, కాలేజీ ఆఫ్ ఎక్సలెన్సీ ద్వారా రెండు లక్షల మంది గిరిజనులు చదువుకొంటున్నారని వివరించారు. నేడు ప్రతి క్లాస్‌కి ఓ టీచర్ ఉన్నారంటే అందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కారణమని పేర్కొన్నారు. యాభై ఏళ్లకే గిరిజనులకు సీఎం చంద్రబాబు పెన్షన్ ఇచ్చారని అన్నారు. గత ప్రభుత్వం 18 పథకాలను రద్దు చేసి గిరిజనులు పొట్ట కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ సీఎంగా చంద్రబాబు వచ్చాక ఆ 18 పథకాలను మళ్లీ అమలు చేశారని చెప్పారు. ఈ రెండేళ్లల్లో రాష్ట్రంలో రూ. 2,500 కోట్లతో గిరిజన ప్రాంతాల్లో రహదార్లు, మౌలిక సౌకర్యాలు కల్పించారని చెప్పారు. ఫీడర్ అంబులెన్స్‌ల సృష్టికర్త చంద్రబాబు అని అన్నారు.

Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: pressmanbharat@gmail.com, Telangana State Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com